


# http://www.యంత్రరాక్షసి.com

లెనిన్ ధనిశెట్టి

ఎలక్షన్ల ఎండ ఛర్రున కాల్చడంతో, మీడియా ఆవాహన చేసిన కార్గిల్ యోగనిద్ర నుంచి మేల్కొన్నాడు రాజు వీరసింహుడు. చాలాకాలంగా యోగనిద్రలో వుండటం వల్ల మత్తుగా మట్టిపాములా వున్నాడు రాజు.

లేచి వొళ్లు విరుచుకొని, ఆవులించి, తన పట్టపు రాణిని కేకేశాడు కాఫీ తెమ్మంటూ. ఎంతసేపటికీ సమాధానం లేదు. తన ఇద్దరు పిల్లల్నీ పిలిచేడు. ఎవరూ రాలేదు. అన్ని గదులూ వెతికేడు... ఎవరూలేరు. ఆశ్చర్యపోయేడు. పక్కవాటా కెళ్లారేమో? అని చొక్కా వేసుకుని రోడ్డు మీదికొచ్చాడు.

అదిరిపడ్డాడు రాజు.

ఎప్పుడూ రద్దీగా ఉండే ఆ రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. పక్కింటి వెంకట్రావును పిలిచేడు. ఎవరూ పలకలేదు. ధైర్యం చేసి ఇంట్లోకి వెళ్లి చూశాడు... అంతా ఖాళీ... పక్కవాటాల్లోనూ అదే పరిస్థితి. కాఫీ తాగకుండానే మత్తు వొదిలిపోయింది రాజుగారికి. ఖాళీ బుర్రతో ఇంటి ముఖం పట్టేడు. ఆ మహానగరం నుంచి తన బంధుమిత్ర వందిమాగధుల ఇళ్లకంతా ఫోన్లు చేశాడు. విచిత్రం. అన్నీ రింగవుతున్నాయే గానీ ఎవరూ ఎత్తుకోవడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. లేచి వెతికి వెతికి ఎప్పుడో ఆర్నెల్లక్రితం తన లోనిక్కర్లో దాచుకున్న బీడీని తీసి వెలిగించి ఆలోచించసాగేడు... ఏమయ్యారు ప్రజలంతా... నిత్యం రోడ్లు వొరుసుకుంటూ ప్రవహించే ఈ జనప్రవాహమంతా ఏవయ్యింది? స్త్రీలు, పురుషులు, పిల్లలుగా విభజించబడిన ఈ ప్రజలంతా ఎటు వెళ్లారు? ఏదో గందరగోళం జరిగింది. ఏదో దుష్టశక్తి నా రాజ్యాన్ని ఆవహించింది. అదేవిటో అర్థం కావడంలేదు. కాలిన బీడీ వేలిని చుర్రుమన్పించడంతో దాన్ని విసిరికొట్టాడు. ఏదో నిశ్చయానికి వచ్చినవాడిలా తన కాళీమాత వరప్రసాదిత ఖడ్గాన్ని పచ్చని బండ మీద సానపెట్టాడు. తరువాత కోటూ గట్రా వేసుకుని నెక్ టై బిగించి ఖడ్గాన్ని వొరలో వుంచుకొని టీవీ ఆన్ చేశాడు బి.బి.సి.లో అనౌన్సర్ గాలిని శబ్దాలుగా మారుస్తున్నాడు తప్ప ప్రజలకు సంబంధించి ఏవీ చెప్పడంలేదు. విసుగేసి జై భీమ్ నామస్మరణ చేసుకుంటూ తన ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ అశ్వాన్ని అధిరోహించి, నగరం వైపు పరుగులెత్తించాడు.

కాంతివేగంతో మెరుపులా ప్రయాణిస్తున్నాడు రాజు... ఎక్కడా ఒక్క మనిషి కూడా కనిపించడం లేదా మెట్రోపాలిటన్ మహాజనారణ్యంలో. మనుషుల్ని వెతికి వెతికి అలసిపోయి పక్క ఊరికి బయల్దేరాడు. మార్గమధ్యంలో ఆకాశంలో నల్లటి వానమబ్బులు బుగబుగా పొంగుకొచ్చాయి. క్షణాల్లో చీకట్లు ముసురుకొన్నాయి. ఏదో అదృశ్యశక్తి చెట్ల కొమ్మలను బలంగా వూపుతున్నట్టు హోరున వీచింది గాలి. కానీ ఎంతకీ వాన కురవడం లేదు. ఇదంతా రాక్షస మాయేనన్న నిర్ధారణకు వచ్చాడు రాజు. మనసులో జై భీమ్ నామస్మరణ చేసుకుంటూ, కొండల్ని పిండే ధైర్యంతో ఉక్కుమనిషిలా ముందుకు సాగేడు. కొంతసేపటికి ప్రశాంత వాతావరణం ఏర్పడింది. అలా ప్రయాణిస్తుండగా దారితప్పి వొక కాకులు దూరలేని కారడివిలోకి ప్రవేశించాడు. ఓ చేత్తో ఎన్‌ఫీల్డ్‌ను సముదాయిస్తూ మరో చేత్తో ఖడ్గంతో దారికడ్డొచ్చే తీగెల్నీ, పొదల్నీ నరుకుతూ రెండు యోజనాల దూరం ప్రయాణించాక మైదాన ప్రాంతం

కన్పించింది. నేలకు పచ్చ రంగేసినట్టుందా ప్రాంత మంతా. ఎక్కడ చూసినా చెట్లు, ఆ చెట్లకు గుత్తులు గుత్తులుగా వేలాడే ఐస్‌క్రీములు, పెప్సీ, కోకోకోలా చెలమలు, వాటిని చూడగానే రాజుకు ఆకలి గుర్తొచ్చింది. ఓ చెట్టు కింద ఎన్‌ఫీల్డ్ స్టాండ్ వేసి కడుపు నిండా అడవి ఐస్‌క్రీములు తిని కోకోకోలా తాగాడు. బాగా తిన డంతో నిద్ర ముంచుకొచ్చి ఓ మర్రిచెట్టు కింద విశ్ర మించాడు.

పక్షుల కిలకిలా రావాలు విని దిగ్గున లేచాడు రాజు. సూర్యాస్తమయం కావొస్తోంది. పక్షులు గూళ్లకు తిరిగి వస్తున్నాయి. రాజు మనసు దిగులుగా మూలి గింది. తన పట్టపురాణి గురించి ఆలోచించాడు. ఆమె బ్రైన్‌డ్రెన్ పెర్‌ఫ్యూమ్ సువాసన గుర్తొచ్చింది. ఆమె మెడ వొంపులోని సింథాల్ సబ్బు వాసనా, ఆమె కురుల్లోని ఆల్ క్లియర్ షాంపూ వాసనా, ఆమె ట్రోమ్ లిప్‌స్టిక్‌లోని వొగరు పరిమళం రాజును చుట్టుముట్టి వుక్కిరిబిక్కిరి చేశాయి. పరిమళాల్లో నుంచి రాజు చెట్టు కొమ్మపై నున్న పక్షుల మాటల్లోకి ప్రవేశించాడు.

"కేపిటలిస్టు కంప్యూటర్ భూతం నగరాలను నగ రాల మనుషుల్ని అమాంతంగా మింగేస్తున్న విషయం పాపం ఈ పిచ్చిమారాజుకు తెల్సినట్టు లేదు," అంది మొదటి పక్షి.

"అవునవును మనం ఎంతో తపోశక్తి వుందను కున్న మన మార్కోయ మహర్షిని కూడా అనుచరులతో సహా మింగేసింది భూతం," చెప్పింది రెండోది.

"అది భూతం కాదు. బ్రహ్మను సైతం శాసించగల బ్రహ్మరాక్షసి," అంది మూడోపక్షి.

"పోలీసు ఎన్‌కౌంటర్లో మనం చనిపోయి ఈ జన్మ ఎత్తకుండా నక్సలైట్లుగానే ఉంటే ఆ బ్రహ్మరాక్షసిని క్లైమోర్ మైన్స్‌తో పేల్చి వుండేవాళ్లం. అయినా పశ్చిమ దిక్కున మూడు సముద్రాలకావల ఇన్ఫర్మేషన్ యూని వర్స్‌లో వుండే ఆ రాక్షసిని ఇతడు ఎలా, ఎప్పుడు చేరు కోగలడు?" అంది ఇంకో పక్షి.

'అది దైవ రహస్యం. మనం భూతకాలాన్ని విశ్లేషించగలమేమో కానీ భవిష్యత్‌ను నిర్ణయించడంలో అసమర్థులం' అంటూ నిస్సహాయత వ్యక్తం చేసిందా మొదటి పక్షి. అంతవరకూ శ్రద్ధగా వాటి మాటల్ని ఆల కించిన రాజు నిట్టూర్చాడు భారంగా. మనసు దిటవు చేసుకొని తన వాళ్లను పొట్టబెట్టుకొన్న బ్రహ్మరాక్షసిని తుదముట్టించే దృఢ సంకల్పంతో పశ్చిమదిశగా బయ ల్దేరాడు.

చీకటి తెరలు కమ్ముకొంటున్నాయి. దారంతా గుంటలూ, మిట్టలుగా వుంది. పైగా వణికించే చలి. మనసులో జై భీమ్‌ను తల్చుకుంటూ ఎన్‌ఫీల్డ్ గుడ్డి వెల్తుర్లో ప్రయాణిస్తున్నాడు రాజు. ఆ చీకట్లో అక స్మాత్తుగా ఎవరో స్త్రీ ఆర్తనాదం విన్పించింది. రాజులోని రాచరక్తం ఉప్పొంగింది. వెంటనే తన వాహనాన్ని అటు మళ్లించాడు. ఎవరో స్త్రీ అశోక వృక్షం కింద డెమీ మూర్‌లా అర్ధనగ్నంగా కూర్చుని హాహాకారాలు చేస్తోంది. 'సాధ్వీమణి! ఏం జరిగింది?' అని ప్రశ్నించేలోగా ఆ స్త్రీ తెల్లటి దయ్యంలా మారి సైరన్‌లా అరుస్తూ రాజుపైకి దూకింది. రెప్పపాటు కాలంలో తన పదునైన కా:మా:వ:ప్ర: ఖడ్గంతో ఆ దయ్యం తల ఖండించాడు రాజు. ఆశ్చర్యం రెండుగా నరకబడ్డ ఆ దయ్యం నుంచి మరుక్షణం రేమాండ్స్ కంప్లీట్‌మాన్ బయటకొచ్చాడు.

"కృతజ్ఞుడను మహారాజా! నా పేరు విచక్షణుడు. ధర్మాధర్మ విచక్షణ నా పని. నాది జంబోద్వీపం. నా పనిని సహించలేని మా 'మనువులు' నన్ను ఈ దుష్ట ఆత్మలో అష్ట దిగ్బంధనం చేశారు. చివరకు నిజాయితీ పరుడైన శంబూకుడిని శరణు వేడగా ఆయన తన తపః శక్తిని నాకు ధారబోసి- భీమనామస్మరణ చేసే వ్యక్తి చేతి లో నీకు శాపవిమోచనం అవుతుందని తెలిపాడు. నాకీ వుపకారం చేసినందుకు మీకు ఏ వరం కావాలో కోరు కోండి రాజా!" అన్నాడు విచక్షణుడు. రాజు తన వృత్తాం తాన్ని కంప్లీట్‌మాన్‌కు పూసగుచ్చినట్లు వివరించాడు. వెంటనే కంప్లీట్‌మాన్ విచక్షణుడు ఒక అందమైన భరిణెను సృష్టించి రాజుకు ఇచ్చి చెప్పాడు-

"ఓ రాజా! ఇందులో వున్న లేపనం పేరు విజన్- 3030. నీ పాదాలకు రాసుకుంటే నువ్వు కోరుకున్న ప్రాంతానికి లిప్తలో చేరుకొంటావు. అలాగే నీకు అశరీర వాణిని వినే అద్భుత వరాన్ని ఇస్తున్నాను. వీటి ద్వారా నీకు మనోభీష్టసిద్ధి అవుతుంది," అని అదృశ్యమ య్యాడు. వెంటనే రాజు లేపనాన్ని తన పాదాలకు, ఎన్‌ఫీల్డ్ టైర్‌కు పూసి వాహనాన్ని అధిరోహించి పశ్చిమ దిక్కుగా మూడు సముద్రాలకు ఆవల వున్న ఇన్ఫర్మేషన్ యూనివర్స్‌కు చేరాలని తలంచాడు. మరుక్షణం రాజు ఇన్ఫర్మేషన్ యూనివర్స్‌లోని ఇన్‌ఫోవ్యాలీలో వున్నాడు తన ఎన్‌ఫీల్డ్‌తో సహా.

*

కళ్లు తెరవగానే తన ముందున్న ప్రపంచాన్ని చూసి వులిక్కిపడ్డాడు. దేదీప్యమైన ఫ్లోరోసెంట్, నియాన్ లైట్ల కాంతిలో వెండికొండలా మెరిసిపోతోందా ప్రాంత

మంతా. సిలికాన్ కొండలతో, ప్లాస్టిక్ అడవులతోనూ నిండిపోయింది ఆ వ్యాలీ అంతా. అక్కడ గాలి లేదు కానీ ఆక్సిజన్ పుష్కలంగా వుంది. ఎక్కడకు వెళ్లాలో ఆ బ్రహ్మరాక్షసిని ఎలా కనిపెట్టాలో అర్థం కావడంలేదు రాజుకు. ఏదయితే అదవుతుందనుకొని తన వాహనాన్ని అధిరోహించి ఆ ప్లాస్టిక్ అరణ్యంలో పశ్చిమ దిక్కుగా దూసుకుపోసాగాడు నున్నటి రోడ్డుపై.

కాలం దొర్లిపోతూ వుంది. రాజు శరవేగంతో ప్రయాణిస్తూనే వున్నాడు. మధ్యలో ఎవరో తనను వెంటాడుతున్నట్లు అనుమానం కలిగింది రాజుకు. వెనుకకు చూశాడు. ఎవరో నల్లని వ్యక్తి వింటి నుంచి వొదిలిన బాణంలా రోడ్డు మీద నుంచి అడివిలోకి దూసుకుపోయాడు. అంతే- రాజు కూడా శరవేగంతో అతణ్ణి అనుసరించాడు. జింకలా పరుగెత్తుతున్న అతడిని చిరుతలా వెంబడించాడు రాజు. కొంతసేప యిన తరువాత ఆ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఏం చేయాలో అర్థంకాలేదు రాజుకు. ఆ ప్రాంతమంతా నిశ్శబ్దంగా వుంది. చివరకు రాజు నిశ్శబ్దంతో నిశ్శబ్దంగా మాట్లాడేడు -

"ఎవరా పిరికిపంద, శరణు వేడితే దయ తలుస్తాను, లేకుంటే, నా ఖడ్గానికి ఎరగా వేస్తాను."

మరుక్షణం చెట్టు కొమ్మల్లోంచి కిందకు దూకాడా వ్యక్తి శరణు వేడుతూ-

"ఓ రెడ్డా నన్నొదిలేసెయి... అబయా నన్ను గాపాడు... పేనాలు గోసీలో బెట్కొని గెద్దలాగా దిరగతా వుండానబయా... నా సావా నన్ను గాపాడు."

"చాలించు నీ ప్రేలాపనలు. ఎవరు నువ్వు? పిచ్చుకలు సైతం తిరుగ సాహసించని ఈ ప్రాంతమున కెలా వచ్చావు?"

"రెడ్డా! నువ్వు జూపుడికి మావూరి రెడ్డోర్ని దించిం డావబయా. నేను అంకడ్ని. చీకిరిదిబ్బ సల్లయారాదొడ్ని. రెడ్డా! ఏం జెప్పమంటావు. నేను మూడు పెళ్లిళ్లకెగిరితే వొక్కడు బుట్నాడు. వోడుగూడా కాలాంతకుడు. మా యానాదేషకాలు ఎయ్‌కుండా బడి జెప్పిచ్చుమన్నాడు. వోడ్ని గూడూళ్లో బడి చెప్పిచ్చా. యాందబయా ఆ నక్కేలి నా కొడుకు మళ్లీ మిష్నీ జెప్పిచ్చుమన్నోడు. నా కొడుకుది నేను నానా యాతనలు పడి నిక్కీనీలిగి ఆ మిష్నీ బడి కూడా చెప్పిజ్నా. ఈ సందులోనే నేను నెల్లూరి చెరువుకి పక్కల్ని దేవనుబోయ్‌నాబయా. అంతే. నేనొచ్చే టయానికి చీకిరి దిబ్బలో వొక్క పిట్టగూడా లేదు. మా సంఘంలో అందురూ ఆగినోళ్లేగానీ మావోడు అడ్రసు లేకుండా బోయినాడు. ఆడెయా ఎట్టాజెప్పేది మా ముగ్గురు ఆడోళ్లు నన్ను తన్నిందానికి ఇడదల్లేదు. వోడ్ని తీస్కొచ్చేదాకా పొయిలో ఎండిచేప గూడా గాల్చేది లేదని మకురేస్కొన్నారు. ఆ దెబ్బతో సక్కాబోయిన మా సంఘం మంత్రకోడి కాడ అంజినం ఎయిపిచ్చా. దాంట్లో సూసి మా మంత్రకోడు ఆడికెట బోవాలనే మందల జెప్పాడు. ఆపట నేను మళ్లీ నెల్లూరి చెరువుకి బొయ్యి దాంట్లో దూకి ఆపట్న పిన్నా చెరువులో దేలి ఆడ మునిగి పులికట్టలో దేలి పచ్చి రాజును మందలడిగి, మనకు లాకిరి ఉండాదాలేదా అని మతంచేసి మళ్లీ ఆడ మునిగి మూడు సవద్రాల దాటుకొని అబయా రెడ్డా ఈ పపం చకంలో బడినా... రెడ్డా నిన్ను చూడంగానే అద్దిరిపోయి వొణికిపోయినా..." గడగడా చెప్పాడు అంకడు.

"నువ్వు భయపడాల్సిన అవసరంలేదు. అనాదిగా మీ యానాదులు మాకు ఎంతో సహకారాలు అందిచ్చారు. ఇక నుంచీ మీరు మాకు మిత్రులు. ఈ కార్య సాధనలో సహచరులు," అన్నాడు రాజు.

ఇంతలో అశరీరవాణి డి.టి.ఎస్. డాల్బీ వాయిస్ విప్పింది.

"ఆహా ఏం కాంబినేషన్ రాజా! చివరకు తీరక బికారికో తోలు తుపాకీ... వుడతను సాకేవాడికి తోకను మోసేవాడొకడు. రాజా! మహా శక్తిమాన్‌లాంటి ఆ బ్రహ్మ రాక్షసి ఎక్కడ? మీరెక్కడ? మీరుండేదేడ? వూలేసేది యాడ? వెనుదిరగండి- సంగి నీళ్లాడితే సింగడు ఇంగవ దిన్నట్టుంది మీ యవారం."

"తల్లీ సర్వమెరిగిన నీవా ఇలా మాట్లాడేది? ఎందుకు మాకు పిరికిమందు నూరిపోస్తున్నావు? మీ మాటలకు మేము బెదరము గాక బెదరము."

"రాజా నువ్వు బెదిరినా, గిదిరినా నేను మాత్రం నీ మేలు కోరి చెబుతున్నాను. బ్రహ్మ రాక్షసిని ఎదుర్కొనేందుకు నీ శక్తి చాలదని ఎంత చెప్పినా వినేటట్టు లేదు నువ్వు- తాటిమాను తావుగాదు. తగొలుకొన్నోడు మొగుడూ గాదు చందంగా నువ్వూ, ఈ యానాదీ కలిసి సాధించేదేమీ లేదు. అయినా ఉత్తకుండకు వూసు లెక్కువ"

"శివ శివ! చాలించు నీ వాచాలత్వం. లేదా మా కా:మా:వ:ప్ర: ఖడ్గంతో నీ కుత్తుకను కత్తిరిస్తాం."

"రాజా! నీకు అంచు డాబే కానీ పంచె డాబు లేదు. ఎంత మొత్తుకున్నా మీరు వినడం లేదు. అకటా వికటపు రాజు - అవివేకపు యానాది. ఒకరి పాట కంటే ఇద్దరి ఏడుపు ఇంపు. అనుభవించండి మీ కర్మ!" అంటూ అదృశ్యమైంది అశరీరవాణి.

''రెడ్డా! ఇది గాలివాక్కు గాదూ! గంపకిందా పెట్టా గాదు. గాలివాక్కుని ఆ బెమ్మరాచ్చసి ఇయారకి మంత్ర కట్టు కట్టేసుంటాది,'' చెప్పాడు యానాది.

అసలే అశరీరవాణి మాటలతో విసిగిపోయిన రాజు సర్రున లేచాడు- ''చూడు యానాదీ! నేను రాజును. నువ్వు... రెడ్డా... రెడ్డా... అని పిలవడం నాకు నచ్చలేదు.''

''రాజా రెండు చేతులెత్తి మొక్కతా వుండా. ఇంకే పూటా ఆ మాదిరిగానే పిలవను. మా సంగానికంతా రెడ్డే రాజు, రెడ్డే మంతిరి. ఇందిరమ్మకు ముందు రాజు లుండేవోళ్లని మా యబ్బ జెప్తా వుండేవోడు. నువ్వేవను కోకబయా- అయినా అబయా మబ్బిడిసిన ఎండ, మొగుణ్నిడిసిన ముండ, పట్టిడిసిన ముండ, ఎత్తినూకిన కుండా ఒకటేనబయా. ఇట్టాటి గాలివాక్కుల్ని... దురతల్నీ వొంద జూసినా... మీరు మాత్రం కుశాలగా పదండి,'' అని అంకడు అంటుండగానే ఫెళఫెళార్భాటా లతో నభోమండలాన్ని తాకేంత ఎత్తులో వున్న బ్రహ్మాండ మైన ఆకారం వాళ్లముందు ప్రత్యక్షమైంది. దాని శరీర మంతా సిలికాన్ పొలుసులు. రాక్షసబల్లి తోకలాంటి పొడవాటి తోక. దాని చివర పెద్ద మౌస్... దాని తల స్థానంలో జెయింట్ సైజ్ సూపర్ కంప్యూటర్, తలపై ఏరియల్ లాంటి పెద్ద కొమ్ము. ఆ బ్రహ్మాండ విచిత్ర ఆకారాన్ని చూసి అంకడు భయంతో రాజు వెనకాల నక్కాడు. రాజుకు కూడా గుండెలు దడదడలాడాయి.

తన ముందు అంగుష్టమాత్రులుగా వున్న వారికేసి చూసి బ్రహ్మరాక్షసుడు తలవొంచి చూసి స్వీట్ వాయిస్ తో ప్రశ్నించేడు పొలైట్‌గా...

''ఎవరు మీరు? నా సామ్రాజ్యానికి అనుమతి లేకుండా ఎలా ప్రవేశించగలిగారు?''

ఆ ప్రశ్నతో రాజు చేయి ఖడ్గంపై బిగుసుకుంది.

''ఓరి రాక్షసాధమా! నిన్ను తుదముట్టించేందుకు వొచ్చిన మృత్యుదేవతలం,'' చెప్పాడు.

''కారణం?''

''మా జాతిని నువ్వు బానిసలుగా మార్చి నిర్మూ లిస్తున్నావు.''

''అబద్ధం - మీకు మీరే నాకు బానిసలుగా మారి నాకు ఆహారమవుతున్నారు.''

''హు, నీకు ఆహారమవుతున్నారా? మా జాతి తెలివినీ, మేధస్సునూ నిజాయితీని శంకించే అర్హత నీకు లేదు కాచుకో,'' అంటూ ఖడ్గాన్ని విసరబోయాడు రాజు.

''రాజా! ఒక్క క్షణం ఆగు. మాటలు జాగ్రత్తగా వాడు... తెలివి... అవును. వేలాది మతాలు, కులాలు వాటికి వందలాది ఉపకులాలు సృష్టించి పథకం ప్రకారం మిమ్మల్ని మీరే నిర్వీర్యం చేసుకునే తెలివైన జాతి మీది. అనవసరంగా అంతులేని శాస్త్ర పరిజ్ఞానాన్ని పెంచి దాన్ని వ్యాపారంగా మార్చి దాని అవసరం లేని చోట కూడా అవసరాన్ని కల్పించే జాతి మీది. మీరెప్పుడో రసాయనాలలో ముంచి తేల్చబడిన రంగుల కరెన్సీ కాగితాలకు బానిసలైపోయారు. బానిసలుగా కూడా మీరు రెండవ తరగతికి చెందినవాళ్లే. లాభం కోసం కన్న తల్లుల్ని కూడా మీరు అమ్మేస్తున్నారు. మీ సాంకేతిక శాస్త్రాలు మీ మూకుమ్మడి ఆత్మహత్యా సాధనాలు. మీ భావాలు వొట్టి నటన. మీ అనుభవాలు కాగితపు పూలు. మీ ఆలోచనలు, విలువలు, కట్టుబాట్లు, అసంబద్ధాలు. మీ నైతికత వొట్టి బూటకం. మీ కళలు, కవిత్వం వొట్టి బోలు. మీ భాష మీ అనుభవాలను ఎన్నటికీ వ్యక్తం చేయలేని నపుంసక భాష. మీరనుకొంటున్నట్లు మీలో దైవత్వం లేదు. జంతువులు కూడా సిగ్గుపడే హీనమైన మనస్తత్వం మీది. మీరు జంతు ప్రవృత్తి నుంచి విశ్వ మానవ ప్రవృత్తిని ఇంకా అందుకోలేదు. ఇటువంటి బలహీనమైన జాతికా నువ్వు రక్షకుడవు? ఇక నిజాయితీ గురించి మాట్లాడే అర్హత మీ జాతిని సృష్టించిన దేవుడికి కూడా లేదు.''

రాక్షసుడి మాటలకు, ''ఓరీ ధూర్త నాస్తికాగ్రణీ! నీ అంతు చూస్తాను,'' అంటూ ఖడ్గాన్ని ఝుళిపించాడు రాజు.

*

''నాయనా రాజా వీరనరసింహా! నువ్వు నన్ను ఏమీ చేయలేవు. కాసేపు ప్రశాంతంగా చెవులొగ్గి నా నిజ తత్వాన్ని గ్రహించు నాయనా! నేను ఆదిని, నేను అంతాన్ని, శబ్దాన్నీ నేనే. రూపాన్నీ నేనే. నేనే వాస్తవాన్ని. భ్రమనూ నేనే. జీవితాన్నీ నేనే. మృత్యువునూ నేనే. నేను మీ జీవితాలను ఆక్రమిస్తాను. మీ తరఫున నేనే ఆలో చిస్తాను. ఇదంతా మీరు చేజేతులా చేసుకున్నదే. యంత్రం మనిషిలా ఆలోచిస్తే ఏవీకాదు కానీ మనిషే యంత్రంలా ఆలోచిస్తే? ఏమవుతుందో నీవిప్పుడు చూస్తున్నావు. నన్ను మీరు సృష్టించారు. నేను మిమ్మల్ని నడిపిస్తాను. రాజా! అనుభూతులు లేని నాకు ఎందుకో నిన్ను చూస్తుంటే జాలివేస్తోంది. నిన్ను, నీవెనకున్న అంకడినీ నేను స్వాహా చేసేముందు మూడు ప్రశ్నలు అడుగుతాను. మీ ఇద్దరిలో ఎవరు సమాధానం చెప్పినా

ఇద్దర్నీ వొదిలేస్తాను. మీ జాతిని తిరిగి మీకప్పగిస్తాను ఏవంటారు?" చెప్పాడు బ్రహ్మరాక్షసుడు.

ఇంతలో అశరీరవాణి రాజుతో అంది.

"రాజా వెనుకటికి సంతానం కోసం సప్త సముద్రాలు దాటిపోతే వుప్పునీళ్లు తగిలి వుండేది కాస్తా వూడిపోయిందట. నా మాట విను. అంతఃకరణ విద్య ద్వారా ఆ రాక్షసుడి ప్రశ్నకు నేను జవాబు చెబుతాను. అవి నువ్వు వాడికి చెప్పి ప్రాణాలు కాపాడుకో."

"తల్లీ నా సహనాన్ని ఎందుకు పరీక్షిస్తున్నావు? రాచవంశంలో పుట్టి అసత్యమార్గాన నడవమంటావా? అమ్మా, మాతృమూర్తి తన బిడ్డకు పిరికిపాలు తాగించడం తగునా? నా జాతిని, నా దేశాన్ని కాపాడుకునేందుకు నా ప్రాణాల్ని తృణప్రాయంగా ఎంచుతాను. చచ్చి వీరస్వర్గం అలంకరిస్తానే కానీ అసత్యమార్గంలో నడిచి నరకంలో మగ్గనుగాక మగ్గను," అన్నాడు రాజు.

రాజు మాటలకు అశరీరవాణి ఇలా పలికింది-

"టీవీ యాంకరిణిలా రాజా నువ్వుత్త అవుట్ డేటెడ్ ఫెలోవి. పత్రికలు కల్పించిన కార్గిల్ యోగనిద్ర ప్రభావంతో నువ్వు అంటున్నావు కానీ జాతీ, దేశం, దేశభక్తీ పెద్ద 'మిత్' నాయనా! నా మాట విను. నీ జాతి తన సహజత్వాన్ని కోల్పోయింది. ఈ బ్రహ్మ రాక్షసుడి చేతిలో నీకు మరణం తప్పదు."

"హతవిధీ నన్ను క్షమించు తల్లీ. నేనా పని చేయలేను," వేడుకున్నాడు రాజు దీనంగా.

"నీ యిష్టం నాయినా! నీ కర్మ నువ్వే అనుభవించు," అంటూ అదృశ్యమైంది అశరీరవాణి.

"ప్రారంభించు నీ ప్రశ్నలు," చెప్పాడు రాజు బ్రహ్మ రాక్షసుడితో.

"కాచుకో రాజా... గాలి కంటే వేగమైనది ఏది?"

"మనసు"

"మొదటి ప్రశ్నకే జవాబు తప్పు చెప్పావు రాజా... గాలి కంటే వేగమైనది ఇ-మెయిల్."

"రెండవ ప్రశ్న- సర్వాంతర్యామి, సర్వజ్ఞాని, భూత, భవిష్య, వర్తమాన కాల నిజతత్వ జ్ఞాని ఎవరు?"

"ఇంకెవరు? ఆ సర్వేశ్వరుడే!"

"తప్పు రాజా! సర్వేశ్వరుడికి తెలియనివి కూడా ఇంటర్‌నెట్‌కు తెలుసు. నా ప్రశ్నకు సరైన సమాధానం ఇంటర్‌నెట్."

"రాజా చివరి ప్రశ్న- భూమి ఎవరి చుట్టూ తిరుగుతోంది?"

"సర్వ జీవరక్షకుడైన ఆ ఉదయభాస్కరుని చుట్టూ."

"ఏ కాలంలో ఉన్నావు రాజా! భూమి ధనం మరియు కంప్యూటర్ల చుట్టూ తిరుగుతోంది."

"రాజా అన్ని ప్రశ్నలకు తప్పుడు జవాబులిచ్చావు. ఇక నా ధర్మాన్ని నేను నిర్వర్తిస్తాను. నాకు జాతి లేదు. కులం లేదు. మతం లేదు. నాకు మీరు మితిమీరిన స్వేచ్ఛనిచ్చారు. అనంత స్వేచ్ఛాబంధితుడనైన నా ధ్యేయం వొక్కటే- వినాశనం- ఇక ప్రపంచంలో ఏ శక్తీ నిన్ను కాపాడలేదు," అంటూ వీరసింహుడ్నీ, అంకణ్నీ వేళ్లతో పురుగుల్ని పట్టినట్టు పట్టి అమాంతంగా మింగేశాడు బ్రహ్మరాక్షసుడు.

పెద్ద చీకటిగుహలో ప్రవేశించినట్టయింది రాజుకీ, అంకడికీ. తర్వాత ఇద్దరూ కొంచెంసేపు చీకటి బిలంలో జర్రున జారుతూ రాక్షసుడి కడుపులోని ఇన్ఫర్మేషన్ హైవే పైన పడ్డారు. ఆ ప్రపంచాన్ని చూడగానే రాజుకు మతిపోయింది. ఇన్ఫర్మేషన్ హైవే పక్కనే సైబర్ మైదానంలో కోట్లాది వెబ్‌సైట్లు.ఆ వెబ్‌సైట్లలో మిలియన్ల ప్రజలు... కీ ఇచ్చిన బొమ్మల్లాగా ఆ మాయాప్రపంచంలో, భ్రాంతుల్లో తేలియాడుతూ... స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు, రకరకాల దేశాల ప్రజలు. వర్చుయల్ రియాలిటీలో ఏ అనుభవానికీ, అనుభూతికీ రాని ఊహాజనిత ప్రపంచంలో విహరిస్తూ వారు కోరుకున్న చోటుకు క్షణాల్లో వెళ్లిపోతూ వేగంగా అటూ, ఇటూ సంచరిస్తున్నారు. ఈ గందరగోళంలో అంకడు తప్పిపోయాడు. వీరసింహుడు తన పట్టపురాణిని, పిల్లల్నీ వెదుకుతూ ప్రపంచ దేశాల వెబ్‌సైట్లన్నీ గాలిస్తున్నాడు. అలా వెతుకుతూ యానిమల్ పార్కులోకి వెళ్లాడు. ఆశ్చర్యం!!! నల్లని హంసలూ, తెల్లని కాకులూ, కోకిలలూ, చిరుతల్లాంటి కోతులు, కోతుల్లాంటి చిరుతలూ, సింహాల్లాంటి ఉడుతలు, పిల్లుల లాంటి పక్షులు, ఏనుగుల్లాంటి చీమలూ... రాజు దిమ్మెరపోయాడు. అక్కడ నుంచి ఛైల్డ్ సెక్స్ వెబ్‌సైట్‌లోకి వెళ్లాడు. రకరకాల దేశాలకు చెందిన పిల్లలు... చెప్పనలవి కాని పనులు చేస్తూ... ముక్కుపచ్చలారని పసికందులు... శివ శివా... ఏవిటీ వైపరీత్యం తండ్రీ! వీరసింహుడి హృదయం ఘోషించింది. లెస్బియన్ క్లబ్బును చూసి కళ్లు మూసుకున్నాడు. కాల్ గర్ల్‌ల వొయ్యారాల్ని, కాల్‌బోయ్స్ వొడుపును చూసి డంగైపోయాడు. ఆ ప్రోడైట్ శృంగారాన్ని చవిచూశాడు. లక్షలాది రతికాండల్నీ, స్త్రీ, పురుష, జంతు, రాసక్రీడల్నీ, పాశ్చాత్య స్త్రీ, పురుషుల బెడ్‌రూమ్ జీవితాల్ని, కోట్లాది

నగ్నచిత్రాల్నీ చూసి, మాటలతోనే అక్కడివారు జరుపుతున్న శబ్దాలనూ, బూతుమాటల్నీ వినీ వినీ చూసీ చూసీ... రాజుకు మతిపోయింది.

అక్కడ నుంచి యథాలాపంగా తత్వ, మానసిక శాస్త్ర వెబ్‌కు విసిరివేయబడ్డాడు. అక్కడ ప్లేటో, కౌటిల్యుడూ, సోక్రటీస్, ఫ్రాయిడ్, మార్క్స్ వంటి మహా మహులతో(?) చర్చలు జరిపాడు. తరువాత అతను అనూహ్యంగా వేలకొలది గ్రంథాలయాల్లోకి విసరబడ్డాడు. కొన్ని సంవత్సరాలపాటు నిరంతర అధ్యయనం చేశాడు.

ఈ ప్రపంచంలో అతను వెళ్లని ప్రాంతమంటూ లేదు. అతను విశ్వం ఆదిలోకి ప్రయాణించాడు. అంతాన్ని దర్శించాడు. జీవపరిణామ క్రమాన్ని, మానవ ఆవిర్భావాన్ని చూశాడు. అనాది మానవ జీవనకోణాల్లోని విధ్వంసాన్ని వీక్షించాడు. చరిత్ర కథల్లోని సామాన్యుడి వెతల్ని విలపిస్తూ చదివేడు. వొళ్లు తెలియని ఆవేశంతో రాజు ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాడు. యత్నించేకొద్దీ ప్రపంచం ముడి మరింత బిగుసుకుపోతోంది. ఈ క్రమంలో అత్యంతాధునిక మేధావిగా మారిన రాజుకు మతిస్థిరం తప్పి పిచ్చొచ్చింది.

మతిస్థిమితం లేని స్థితిలో కొన్నాళ్లు గడిచాక అతను న్యూరోసైన్స్ వెబ్‌లోకి విసిరివేయబడ్డాడు. అక్కడ రాజుకు రకరకాల చికిత్సలు చేశారు. ఉన్మాదం తగ్గి ఇన్నాళ్లూ తాగిన జ్ఞానసారా మైకంలో అలాగే మత్తుగా పడి వున్నాడు. ఆఖరి చికిత్స నిమిత్తం అతను ఇంతవరకూ మానవుడు అడుగుపెట్టని వర్జిన్‌లాండ్ ప్రాంతానికి కొనిపోబడ్డాడు.

అక్కడి పచ్చని ప్రకృతి పొత్తిళ్లలో రాజు నిద్రించాడు తమకంతో. ఆ నిద్రలో అందమైన కలకన్నాడు... మేల్కొన్నాడు. కళ్లు తెరవగానే అమాయకపు మొహంతో, మూర్తీభవించిన అమ్మతనంతో, నిటారుగా ఆత్మ విశ్వాసంతో స్వేచ్ఛగా గాలికి తలవూపుతున్న గడ్డిపువ్వును చూశాడు. రాజుకు జ్ఞానోదయం అయింది. గడ్డిపూవును చేత్తో స్పృశించాడు అబ్బురంతో... అంతే! ఆ గడ్డిపువ్వు అంకడిగా మారిపోయింది. అంకడు ఆనందంతో రాజును కౌగిలించుకున్నాడు. "రాజా నీ పొసుగూల ఇన్నేళ్లూ యాడికి బోయినావు. నిన్నెతకలేక సత్తినే. ఈ రాచ్చసి పేనాలు యాడుండాయో గనిపెట్టేసినా," అని రాజు చెవులో రహస్యంగా చెప్పాడు. రాజు, అంకడు నింపాదిగా నడుస్తూ హైవేని చేరారు. హైవే పైనున్న మాన్‌హోల్‌ను తొలగించి వొడుపుగా అందులోకి దూకి బ్రహ్మరాక్షసుడి రక్తమాంసాల్లోకి ప్రవేశించాడు రాజు. కాళిమాత వరప్రసాదిత ఖడ్గంతో మహోద్రేకంతో అక్కడి వైర్లను, సర్క్యూట్లను ఖండించసాగేడు. గిలగిలలాడాడు బ్రహ్మరాక్షసుడు. భీకర ప్రయత్నం తరువాత సిలికాన్ చిప్ గుండెల్లో తన ఖడ్గాన్ని గురిచూసి నిలువునా దించాడు- అంతే, విలవిలలాడుతూ మొదలు నరికిన మహావృక్షంలా కూలుతున్న పర్వతంలా నేలకూలాడు బ్రహ్మరాక్షసుడు. వాడి శరీరాన్ని చీల్చుకొని బయటపడుతున్నారు మిలియన్ల మంది ప్రజలు. వారి మొహాల్లో జీవకళ, వింత ఆనందం. వారిలో రాజు వీరసింహుడి పట్టపురాణి, పిల్లలూ, అంకడి కొడుకూ వున్నారు. వారు అంతులేని ఆనందంతో ఒకర్నొకరు కావలించుకున్నారు. ఆ నిశ్శబ్దానందంలో కొసప్రాణంతో వున్న బ్రహ్మ రాక్షసుడి కంఠం ఖంగున మోగింది -

"రాజా నీ విజయం తాత్కాలికం," అంటూ.

ఆ క్షణమే రాజు విసిరేసిన ఖడ్గం సర్రున గాలిని చీల్చుకుంటూ వెళ్లి బ్రహ్మరాక్షసుడి కంఠంలో దిగబడింది. రాక్షసుడు ఆఖరి శ్వాస వదిలాడు. అతడి శరీరంలోంచి ప్రజలింకా వొస్తూనే వున్నారు. వారిని చూపించి రాజు చెప్పేడు అంకడితో- "అంకయ్యా వాళ్లు ప్రజలు. వారే ప్రపంచం. వారు ఇక ఈ మట్టి వాసనకు పరవశిస్తారు. వారు వెన్నెలను అనుభవిస్తారు. సూర్యరశ్మిలో శ్రమ సాగిస్తారు. వేణుగానానికి స్పందిస్తారు. వారు తల్లి ప్రేమకు చలిస్తారు..." చెప్పుకుపోతున్న రాజుపై హాలీ, టాలీ, బాలీ, మాలీవుడ్ తారలు పుష్పవర్షం కురిపించారు హోరున...

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 26 సెప్టెంబరు 1999*

